సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



హుండీ ఆదాయం లెక్కింపు

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మహాశివరాత్రి సందర్భంగా రూ.3,49,603 ఆదాయం లభించింది.



ఈవీఎం గోదాము పరిశీలన

ఏలూరు (మెట్రో): కలెక్టరేట్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం), వీవీప్యాట్ గోదామును సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు.



అగ్నిప్రమాదాలపై అప్రమత్తం

ఆకివీడు: దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో అగ్నిప్రమాదాల నివారణపై ఎస్‌ఎఫ్‌ఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

సత్వర న్యాయానికి కృషి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా సత్వర పరిష్కారానికి కృషిచేయాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 17 ఫిర్యాదులు అందగా వాటిలో ఆస్తి తగాదాలు, కట్న వేధింపులు, చీటింగ్ కేసులు ఉన్నాయన్నారు. ఫిర్యాదులు క్షుణ్ణంగా పరిశీలించి, చట్టప్రకారం విచారించి నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులను ఎస్పీ ఆదేశించారు.

ఈపీఎఫ్‌ఓ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న సహాయ కమిషనర్

సాక్షి, భీమవరం: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని ఆ సంస్థ సహాయ కమిషనర్ యమజాల దుర్గాశ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక విష్ణు కళాశాల ఆడిటోరియంలో ఈపీఎఫ్‌ఓ ఖాతాదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈపీఎఫ్‌ఓ సేవలపై అవగాహన, వినతుల స్వీకరణ, పరిష్కారం, ఉద్యోగుల భవిష్య నిధి పథకం, ఉద్యోగుల పింఛన్ పథకం, ఉద్యోగుల పాదుపు ఆధారిత బీమా పథకం, ఉద్యోగుల భవిష్య నిధి పథకం, భవిష్య నిధి సొమ్మును ఉపసంహరించుకోవడం, పీఎఫ్ సొమ్ము బదలీ, ఈకేవైసీ, యూఏఎన్ వంటి అంశాలపై వివరించారు. మేనేజర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈఎస్‌ఐసీ దినోత్సవం సందర్భంగా వచ్చేనెల 10వ తేదీ వరకూ పక్షోత్సవాలను నిర్వహిస్తామన్నారు. జిల్లా ఖజానా అధికారి అదారి గణేష్, ఈపీఎఫ్‌ఓ నోడల్ అధికారి పి.శివరామకృష్ణ, తహసీల్దార్ వై.రవికుమార్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి: శాస్త్రీయ పద్ధతుల ద్వారా తేనెటీగల పెంపకం చేపడితే అధిక లాభాలు గడించవచ్చని ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతుల్లో తేనెటీగల పెంపకంపై ఏడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కుటీర పరిశ్రమగా దీనిని స్థాపించి నిరుద్యోగులు ఉపాధి పొందవచ్చన్నారు. మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ నామాల శ్రీనివాసరావు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దెబోరామెస్సియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ పి.వినయలక్ష్మి, వెటర్నరీ ఏడీఏ డాక్టర్ మల్లేశ్వరరావు,పలువురు యువకులు పాల్గొన్నారు.

పరిశోధనలతో దేశ ప్రగతి




మాట్లాడుతున్న ఐఐటీ ప్రొఫెసర్ పెద్దిరెడ్డి

తాడేపల్లిగూడెం: పరిశోధనలు ప్రయోగశాలల నుంచి క్షేత్రస్థాయికి చేరినప్పుడే వాటికి సార్థకత ఉంటుందని, పరిశోధనలపైన దేశ ప్రగతి ఆధారపడి ఉందని ఐఐటీ భువనేశ్వర్ స్కూల్ ఆఫ్ బేసిక్ బిజినెస్ విభాగం ప్రొఫెసర్ వీఆర్ పెద్దిరెడ్డి అన్నారు. జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏపీ నిట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశోధనా ఫలితాలను ప్రజలకు చేరేలా ప్రయత్నించాలన్నారు. నిట్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక అంశాలకు సాంకేతికతను జోడించి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఎస్‌ఐఆర్–ఎన్‌పీఎల్ ఫార్మర్ డైరెక్టర్ డాక్టర్ డీకే అశ్వాల్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచదేశాలకు దీటుగా రాణిస్తుందన్నారు. డీన్ అకడమిక్ టి.కురుమయ్య, డీన్‌లు శాస్త్రి, వీరేష్, జయరామ్ మాట్లాడారు. కో–ఆర్డినేటర్లుగా అరుణ్‌కుమార్, కృష్ణమూర్తి, తపస్.సుదర్శన్, ద్వివేది, అమరేంద్ర, రాముడు నారాయణ వ్యవహరించారు.

పునరావాసం.. అద్భుత నిర్మాణం

- సుందరంగా నిర్వాసిత కాలనీలు
- ఉభయగోదావరి జిల్లాల్లో 53 కాలనీల నిర్మాణం
- ఏలూరు జిల్లా తాడువాయిలో మెగా లేఅవుట్
- రూ.435 కోట్లతో 3,905 ఇళ్లు
- రూ.1,523 కోట్లతో పోలవరం పునరావాస కాలనీలు



తాడువాయిలో పూర్తయిన మెగా కాలనీ


సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలవరం పునరావాస కాలనీలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ముంపు నిర్వాసితులకు మెరుగైన సౌకర్యాలతో నివాసాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వీటిని నిర్మిస్తుంది. ఇప్పటికే ఏలూరు జిల్లాలోని తాడువాయిలో మెగా కాలనీతో పాటు బుట్టాయగూడెంలో కొన్ని కాలనీలు పూర్తికాగా.. నిర్వాసితులు కొందరు నూతన గృహాలకు చేరారు. పూర్తి స్థాయిలో పరిహారం అందిన వారిని ఇళ్లకు తరలించే దిశగా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తుంది. ఉభయగోదావరి జిల్లాల్లో రూ.1,523 కోట్ల వ్యయంతో 53 కాలనీల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి.

తాడువాయిలో భారీగా..

ఏలూరు జిల్లాలో నిర్వాసితుల ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. ప్రధానంగా జంగారెడ్డిగూడెం రూరల్ మండలంలోని తాడువాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా 6,048 ఇళ్ల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 1,047 ఎకరాలు భూమి సేకరించగా గృహాలు, మౌలిక వసతుల కోసం 532 ఎకరాల భూమి కేటాయించారు. అలాగే రూ.435.05 కోట్ల వ్యయంతో 3,905 ఇళ్ల నిర్మాణం ప్రారంభించి అనుకున్న సమయానికి పూర్తి చేశారు. కొందరు లబ్ధిదారులు గతేడాది గృహప్రవేశాలు చేశారు. 938 మంది ప్లాట్లు తీసుకుని వారే స్వయంగా ఇళ్లు నిర్మించుకోనున్నారు. మరో 1,205 ప్లాట్ల నిర్మాణం పూర్తయ్యింది. పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నిర్వాసితులతో పాటు పోలవరం, తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని గ్రామాలకు చెందిన గిరిజనేతరుల కోసం తాడువాయిలో పునరావాస కాలనీలు నిర్మించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వందల కోట్లు ఖర్చు చేసి సకల సౌకర్యాలతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. దీనిలో 530 ఎకరాల్లో పునరావాస కాలనీలు, మిగిలిన 517 ఎకరాల్లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, వాటికి అనుగుణంగా కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసేలా భూములు గుర్తించారు.

తాడువాయి మెగా లేఅవుట్

మొత్తం ఇళ్లు	6,048
ప్రభుత్వం నిర్మించి ఇచ్చే ఇళ్లు	3,905
నిర్వాసితులు సొంతంగా నిర్మించుకునేవి	2,143
ఆర్‌అండ్‌ఆర్ కోసం సేకరించిన భూమి	1,047 ఎకరాలు
ఇళ్లు, మౌలిక వసతులకు కేటాయింపు (మిగిలిన భూమి భవిష్యత్తు అవసరాల కోసం)	530 ఎకరాలు
మౌలిక వసతుల్లో భాగంగా నిర్మించే కట్టడాలు	62
ప్రాజెక్టు వ్యయం అంచనా	రూ.435.05 కోట్లు



బుట్టాయగూడెం మండలంలో..

బుట్టాయగూడెం మండలంలోని పైడాకులమామిడి, అల్లవరం, పల్లపూరు, నులకలగూడెం, తూడుగుంట, సరుగుడులోని కాలనీల్లో సుమారు 1,500కు పైగా ఇంటి నిర్మాణాలు పూర్తికాగా నిర్వాసితులను ఇక్కడకు తరలించారు. కాలనీల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుతో పాటు స్థానికుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేస్తున్నారు. జీలుగుమిల్లి మండలంలో కామయ్యపాలెం, రౌతుగూడెం, పోలవరం మండలం ఎల్‌ఎన్‌డీ పేటలో నూరుశాతం నిర్మాణాలు పూర్తికాగా కొందరు కొత్త ఇళ్లకు చేరారు.

నైపుణ్య శిక్షణకు.. గతేడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తాడువాయిలోని మెగా కాలనీలను సందర్శించారు. మహిళలకు, యువతకు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా నిర్వాసితులు కోరగా ఆ దిశగా సర్కారు కసరత్తు చేస్తోంది. పూర్తిగా నాన్‌ట్రైబల్ కాలనీ కావడంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.

ఊళ్లను తలపించేలా.. కాలనీల్లో గుడి, మసీదు, చర్చి, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాలు, పంచాయతీ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్, పాఠశాలలు, బ్యాంకు, రైతుబజార్, ఏఎన్‌ఎం సబ్‌సెంటర్, పశు వైద్యశాల, గోడౌన్లు, మినీ కోల్డ్ స్టోరేజీలు, వాటర్ ట్యాంక్, బస్‌షెల్టర్, ఇండోర్‌స్టేడియం, డంపింగ్ యార్డ్, పోస్టాఫీస్, పీహెచ్‌సీ, శ్మశానవాటికలు–3, వ్యక్తిగత మరుగుదొడ్లు, రెండు పార్కులు నిర్మించేలా ప్లాన్‌లో రూపొందించారు.

చాలా బాగున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాసిత కాలనీలను అద్భుతంగా కట్టించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ ద్వారా లక్షల్లో ఉద్యోగాలు కల్పించింది. అలాగే నిర్వాసిత యువతకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పనకు తోడ్పాటు అందించాలని కోరుతున్నాం.

– బద్దె ప్రేమ్‌కుమార్, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, చల్లవారిగూడెం

ప్రతి వారం సమీక్ష



నిర్వాసితులను త్వరితగతిన కాలనీలకు తరలించేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి వారం పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌పై సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నాం. మిగిలిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. పూర్తయిన ఇళ్లకు నిర్వాసితులు చేరేలా ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోంది.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించి అర్జీదారులకు సంతృప్తికర సేవలు అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలు మరలా ఓపెన్ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఒకే సమస్యపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోజూ స్పందనపై పది నిమిషాల సమయం కేటాయిస్తే ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారమవుతాయన్నారు. స్పందన కార్యక్రమంలో 170 అర్జీలు వచ్చాయని, వీటన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. డీఆర్వో కె.కృష్ణవేణి, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తన భర్త చనిపోయి 10 నెలలు అవుతుందని, తనకు పింఛన్ మంజూరు కాలేదని ఇరగవరం మండలం పిల్లివారిపాలెంకు చెందిన పిల్లి అనంతలక్ష్మి అర్జీ అందజేశారు.
- తన కుమారుడు పట్టించుకోవడం లేదని ఉండి మండలం ఉప్పులూరుకి చెందిన యర్ర ఆదిమూర్తి అనే వృద్ధుడు ఫిర్యాదు చేశారు.
- తాను, తన తమ్ముడు దివ్యాంగులమని ప్రభుత్వ పింఛన్‌పై బతుకుతున్న తమకు 35 కిలోల బియ్యం కార్డు మంజూరు చేయాలని అత్తిలి మండలం స్కిన్నెరపురానికి చెందిన కుక్కల రామయ్య అభ్యర్థించారు.

వివాహాల రిజిస్ట్రేషన్‌కు చర్యలు

జిల్లాలో జరిగే వివాహాలన్నీ రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్షించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు

పటిష్ట ఏర్పాట్లు

5న సీఎం జగన్ రాక



హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

యలమంచిలి: ప్రభుత్వ చీఫ్‌విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహం వచ్చే నెల 5వ తేదీన కలగంపూడి గ్రామంలో జరుగనుండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు కాజ తూర్పు గ్రామంలోని నరేంద్రస్వామి దేవస్థానం భూమిలో నిర్మిస్తున్న హెలీప్యాడ్ నిర్మాణ పనులను సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా కేటాయించిన పనుల్లో ఎక్కడా లోటుపాట్లు రాకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలగంపూడిలో నిర్మిస్తున్న వివాహ వేదిక పనులను కూడా ఆమె పరిశీలించారు. ఎస్పీ యు.రవిప్రకాష్, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌అండ్‌బీ అధికారి ఎస్.లోకేశ్వరరావు, డీపీఓ ఎం.నాగలత, డీఎస్పీ కె.రవిమనోహరాచారి, తహసీల్దార్ లక్కు నరసింహరావు, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి ఆమె వెంట ఉన్నారు.

ఎమ్మెల్సీ బరిలో ఆరుగురు

- నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి
- 13న పోలింగ్.. 16న కౌంటింగ్

సాక్షిప్రతినిధి, ఏలూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం సాయంత్రం పూర్తికాగా బరిలో ఆరుగురు అభ్యర్థులు నిలిచారు. వీరిలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో పాటు నలుగురు స్వతంత్రులు ఉన్నారు. టీడీపీ మండల నాయకుడు ఉండగా, మరికొందరు సానుభూతిపరులు ఉన్నారు. టీడీపీ నుంచి స్పష్టత రాకపోవడంతో ఆ పార్టీ నాయకులే కొందరు సానుభూతిపరులతో నామినేషన్ వేయించారు.

వైఎస్సార్ సీపీ గెలుపు లాంఛనం

అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ బరిలో నిలిచారు. రవీంద్రనాథ్ భార్య రాజకుమారి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. మొత్తం 8 మంది అభ్యర్థులు 15 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా తిరస్కరణ, ఉపసంహరణ అనంతరం ఆరుగురు అభ్యర్థులు నిలిచారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులతో పాటు టీడీపీ మండల స్థాయి నాయకుడు వీరవల్లి చంద్రశేఖర్ స్వతంత్ర అభ్యర్థిగా, అలాగే టీడీపీ సానుభూతిపరులుగా దేవరపల్లి ఆదాంతో పాటు స్వతంత్రులుగా గోరింక దాసు, పసలవెంకటాచలం బరిలో నిలిచారు. బరిలో టీడీపీ సానుభూతిపరులు ఉన్న క్రమంలో ఆ పార్టీ మద్దతుపై పార్టీ నేతల్లో స్పష్టత రాలేదు. స్వతంత్రుల్లో ఒకరికి మద్దతు ఇవ్వడం లేదా ఎన్నికలకు దూరంగా ఉండే విషయంపై రెండు రోజుల్లో ప్రకటించనున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల్లో 85 శాతానికిపైగా ఓట్లు అధికార వైఎస్సార్ సీపీకి ఉండటంతో పార్టీ అభ్యర్థుల గెలుపు సునాయాసం కానుంది.

ఐదు కేంద్రాల్లో పోలింగ్

వచ్చే నెల 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురం, కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 16న కౌంటింగ్ నిర్వహించి 21తో ఎన్నికల ప్రక్రియ ముగించి కోడ్ తొలగిస్తారు.

ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ మోనిటరింగ్ (ఎంసీఎంసీ) కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రిటర్నింగ్ అధికారి, జేసీ పి.అరుణ్ బాబు చైర్మన్, ఏఆర్‌ఓ, జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్‌ఎస్ మూర్తి నోడల్ అధికారి, డీఐవో జీవీఎస్‌ఆర్ శర్మ, సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఇన్ఫర్మేషన్, బ్రాడ్ కాస్టింగ్‌కు చెందిన కె.శ్రీరామమూర్తి, దూరదర్శన్, ఏఐఆర్ కరస్పాండెంట్ ఐ.సుబ్బారావు సభ్యులుగా, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని, మెంబర్ సెక్రటరీగా ఉన్నారు.

మాతాశిశు మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి

ఏలూరు(మెట్రో): జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా, వీటి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వైద్యులు, వైద్యారోగ్య శాఖ అధికారులపై ఉందని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో సోమ వారం మాతా, శిశు మరణాలపై ఆయన సమీక్షించారు. మాతృ మరణాలకు దారితీసిన కారణాలపై వైద్యుల నివేదికలను పరిశీలించారు. గర్భిణులకు చికిత్స విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని అధికారులకు సూచించారు.

సర్రాజు సేవలు ఎనలేనివి

సంతాప సభలో వక్తల నివాళి







సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీలు మిథున్‌రెడ్డి, కోటగిరి శ్రీధర్, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, ఎమ్మెల్యేలు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, గ్రంధి శ్రీనివాస్, పుప్పాల వాసుబాబు, నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, సంతాప సభకు హాజరైన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్

ఆకివీడు/కాళ్ల/ఉండి: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు సేవలు ఎనలేనివని, ఆయన మరణం వైఎస్సార్ సీపీకి తీరనిలోటని ఎంపీలు మిథున్ రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, కోటగిరి శ్రీధర్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భీమవరం ఆదర్శ కాలనీలోని సర్రాజు నివాసం వద్ద సోమవారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా సర్రాజు చిత్రపటం వద్ద ముఖ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్రాజు సేవాతత్పరుడిగా, అందరివాడిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు అండగా ఉన్నారన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. సర్రాజు ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ కంచుకోటను పగులగొట్టిన ఏకైక నాయకుడు సర్రాజు అని కొనియాడారు. దివంగత వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ సీఎం జగన్‌కు అండగా నిలిచారన్నారు. పేదలకు గూడు కల్పించాలనే సంకల్పంతో తాళ్లకోడులో 75 ఎకరాలు కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఉండి కేవీకే కేంద్రానికి, తాళ్లకోడులో పేదల ఇళ్ల కాలనీకి సర్రాజు పేరు పెట్టాలని నాయకులు కోరారు. సంతాప సభలో ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, పుప్పాల వాసుబాబు, మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీలు మేకా శేషుబాబు, కంతేటి సత్యనారాయణరాజు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, గోకరాజు రామరాజు, గోకరాజు విఠల్ కనకరంగరాజు, కరాటం రాంబాబు, ముత్యాల రత్నం, కనకరాజు సూరి, ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, గూడూరి ఉమా, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కనుమూరి అబ్బాయిరాజు, గాదిరాజు సుబ్బరాజు, పెనుమత్స గోపాలకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తిన్న చిన్నారులకు అస్వస్థత



చిన్నారులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తణుకు: తణుకు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు ఫుడ్ పాయిజన్ కావడంతో అస్వస్థతకు గురయ్యారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆరో నెంబరు పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం తిన్న అనంతరం కొద్ది సేపటికి అయిదుగురు విద్యార్థులకు వాంతులయ్యాయి. దీంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో పది మందికి సైతం వాంతులయ్యే సూచనలు ఉన్నాయని చెప్పడంతో మొత్తం 15 మందిని ఆసుపత్రికి తరలించి వైద్యం అందజేశారు. సోమవారం మెనూ ప్రకారం కట్టె పొంగలి, ఉడికించిన గుడ్డు, చిక్కీ అందజేశారు. అయితే తిన్నకొద్ది సమయానికే వీరంతా వాంతులు చేసుకోవడంతో ఆందోళన నెలకొంది. అజీర్తి కారణంగా అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు ఆసుపత్రికి చేరుకుని సమీక్షించారు. వంట ఏజెన్సీను రద్దు చేసి కొత్త ఏజెన్సీకు బాధ్యతలు అప్పచెబుతున్నట్లు ఆయన ప్రకటించారు. చిన్నారులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు నాయకులను అప్రమత్తం చేసి హుటాహుటిన వారిని ఆసుపత్రికి పంపించారు. చిన్నారులకు అందుతున్న వైద్యంపై మంత్రి ఆరా తీశారు.

పగలు సెగలు.. రాత్రి వణుకు

- 10 రోజుల నుంచి మండుతున్న ఎండలు
- రాత్రి పూట తగ్గని చలిగాలు

నరసాపురం: ఈ ఏడాది సూరీడు ముందే సుర్రుమంటున్నాడు. ఉమ్మడి పశ్చిమలో గత 10 రోజుల నుంచి ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతోంది. ప్రస్తుతం ఫిబ్రవరి నెల చివరిలో సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఇంకా వేసవికాలం పూర్తిగా రాలేదు. అయినా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగతూనే ఉంది. గత వారం రోజుల నుంచి పశ్చిమ, ఏలూరు జిల్లాలో పగటిపూట 36 నుంచి 39 డిగ్రీల సెలిసియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఇవి అత్యధిక ఉష్ణోగ్రతలు. గత ఏడాది మార్చి రెండో వారం నుంచి గాని జిల్లాలో ఉష్ణోగ్రతల్లో పెరుగుదల లేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండలు మండుతుండటంతో రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని జిల్లా ప్రజలు భయపడుతున్నారు.

మరోవైపు వణికిస్తున్న చలి

మరో వైపు రాత్రి పూట చలి తీవ్రత వేధిస్తోంది. గాలిలో తేమశాతంలో భారీ హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. దీంతో పగలు ఎండ, రాత్రిపూట చలికి జనం ఇబ్బందిపడుతున్నారు. ఉమ్మడి పశ్చిమలో పగటిపూట 36–39 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాత్రిపూట 20–22 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పగటిపూట గాలిలో తేమశాతం 56 నుంచి 60 శాతం మధ్య నమోదవుతుంది. పగటిపూట గాలిలో తేమ 5 శాతం వరకూ తగ్గిందని వాతావరణ శాఖ అధికారులు చెపుతున్నారు. రాత్రి పూట గాలిలో తేమశాతం గరిష్ఠంగా 96 వరకూ నమోదు అవుతుంది. దీంతో రాత్రిపూట చలి తీవ్రత పెరగడమే కాకుండా వృద్ధులు, పిల్లలు, ఆస్మా, ఇతర దీర్ఘకాల రోగాలతో బాధపడేవారికి ఇబ్బందిగా మారింది.



గత ఏడాదికి.. ఈ ఏడాదికి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం

	2022	2023
ఫిబ్రవరి 23	36	38
ఫిబ్రవరి 24	35	37
ఫిబ్రవరి 25	36	38
ఫిబ్రవరి 26	36	39
ఫిబ్రవరి 27	37	39

వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండల తీవ్రత పెరుగుతోంది. వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థులకు పరీక్షల కాలం సమీపిస్తోంది. వారు అనారోగ్యం పాలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో ఎక్కువగా తిరగకూడదు. మంచి ఆహారం తీసుకుని జాగ్రత్తగా ఉండాలి. బీపీ, మధుమేహం వంటి దీర్ఘకాల రోగాలకు మందులు వాడుతున్న వారు, ఆస్మా రోగులు జాగ్రత్తలు పాటించాలి.

– బళ్ల మురళీ, వైద్యుడు

ఇంటర్ ప్రయోగ పరీక్షకు 13,143 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్ ప్రయోగ పరీక్షల రెండో రోజున ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 13,143 మంది విద్యార్థులు హాజరయ్యారు. సైన్స్ పరీక్షకు సోమవారం 9868 మంది హాజరయ్యారు.

గూడెంలో దోపిడీ దొంగల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: దారి దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్.మూర్తి తెలిపారు. సోమవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ కృష్ణా జిల్లా నందివాడకు చెందిన ఇలపర్తి అబ్రహం గుడివాడలోని కుమార్ సోప్స్ కంపెనీ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. చెడు తిరుగుళ్లకు అలవాటు పడి మరో ముగ్గురితో కలిసి చోరీలకు పాల్పడేవాడు. గతంలో అబ్రహాం తాను పనిచేసిన కుమార్ సోప్స్ వ్యాన్ (ఐసర్)కు జీపీఎస్ అమర్చాడు. వ్యాన్ లోడుతో వెళ్ళిన సమయంలో కారులో వెంబడించాడు. ఈ నెల 24న తెల్లవారుజామున 3.10 గంటల ప్రాంతంలో తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామం వద్ద వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, గుమస్తాలను కొట్టి రూ.40 వేలు నగదుతో ఉన్న బ్యాగును చోరీ చేసి, పారిపోయారు. దాట్ల రాజా అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పెదతాడేపల్లి కమ్మ కళ్యాణమండపం వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇలపర్తి అబ్రహం (నందివాడ), తిట్ల ఇస్సాకు (బొమ్ములూరు), వమ్మి సురేష్ (పెదపాడు), కోరం ఆనంద్ (పెదపాడు) లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో కృష్ణాయపాలెం చోరీకి సంబంధించి నేరం అంగీకరించినట్లు రూరల్ సీఐ మూర్తి తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.30వేలు రికవరీ చేశామన్నారు.



తాడేపల్లిగూడెంలో విలేకరులతోమాట్లాడుతున్న రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి

ఉంగరం కోసమే చంపేశాడు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కనిపించకుండా పోయిన వ్యక్తి 12 రోజులు తరువాత మొగల్తూరు కాలువలో శవమై కనిపించిన సంఘటన సంచలనంగా మారింది. సోమవారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎస్పీ యు.రవిప్రకాష్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సోమేశ్వర అగ్రహారానికి చెందిన నిడమర్తి వెంకట సత్య సాంబశివరామ్ (44) స్థానిక పెద్దసాయిబాబా ఆలయం రోడ్డులో ఉన్న ఓ చెక్కల షాపులో వడ్రంగి పని చేసేవాడు. ఈ నెల 11న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన సాంబశివరామ్ కనిపించకుండా పోయాడు. మృతుని సోదరుడు షాపు యజమానికి ఫోన్ చేసి అడగగా రాత్రి 7.20 గంటలకే వచ్చేశాడని తెలిపారు. మృతుడి మిత్రుడైన ఉల్లంపర్రు గ్రామానికి చెందిన పి. వీర రాఘవులు (వీరబాబు)ను ప్రశ్నించగా రాత్రి ఆర్‌వి సుబ్బారావు ఆసుపత్రి రోడ్డు వద్ద దింపేశానని తెలిపాడు. మృతుని సోదరుడు నిడమర్తి వెంకట సత్య బాల బాలాజీ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 12 రోజులు తరువాత నిడదవోలు, మొగల్తూరు కాలువలో సీతారామపురం గ్రామం దాటిన తరువాత కోతుల గుంట ఫుట్ పాత్ బ్రిడ్జి సమీపంలో కాలువలో శవమై తేలాడు. అతని దుస్తులను బట్టి బంధువులు సాంబశివరామ్‌గా గుర్తించారు. మృతుని చేతికి ఉన్న ఉంగరం కనిపించకుండా పోవడంతో అతని స్నేహితుడు వీరబాబుపై అనుమానంతో విచారణ చేయగా అతని చేతికి ఉన్న ఉంగరం లాక్కుని అతన్ని మొగల్తూరు వద్ద కాలువలోకి గెంటినట్లు విచారణలో తేలిందన్నారు. ఉంగరం పట్టణంలో ఓ స్వర్ణకారుడి వద్ద విక్రయించి నగదు తీసుకుని అప్పులు తీర్చుకున్నట్లు తెలిపాడన్నారు. సోమవారం స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డు ఆదిత్య కాలేజ్ వద్ద వీరబాబును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో నరసాపురం డీఎస్పీ మనోహరాచారి, ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస యాదవ్, ఎస్సై ఎస్ ముత్యాలరావు, ఏఎస్సై ఏసుబాబు, కానిస్టేబుల్స్ మోజేష్, బాలాజీ, ప్రసాద్ బాబు, ఉదయ్, శాంతారావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రవి ప్రకాష్, డీఎస్పీ మనోహరాచారి

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ: ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

ప్రీతి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్) : గిరిజన వైద్య విద్యార్థిని డాక్టరు ధారావత్ ప్రీతి మరణానికి కారకులైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. తెలంగాణా రాష్ట్రంలో ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసిన గిరిజన లంబాడీ కుటుంబానికి చెందిన ప్రీతి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజ్‌లో పీజీ చదువుతుందన్నారు. ఆమె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గుగ్గులోతు కృష్ణ నాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదరిశ బోడా బాలా నాయక్ కోరారు. సీనియర్ వైద్య విద్యార్థి సైఫ్ వేధిస్తున్నాడంటూ పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఆమె చావుకు కారణమైన వారందరిపై హత్యా నేరం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రీతి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

క్లుప్తంగా

కర్నాటి రాంబాబుకు సత్కారం



కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబును సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర స్వామి కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబును విజయవాడలో జరిగిన బోర్డు మొదటి కార్యవర్గ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం తాడేపల్లిగూడెం గౌరవాధ్యక్షుడు, ట్రస్ట్ బోర్డు సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకులు మారం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, దాగారాపు నాగు, ఆర్యవైశ్యులు నున్న సుందరం, పులవర్తి రాంపండు, కె.హరనాథ్, వబిలిశెట్టి ధనరాజు, గ్రంధి సూరిబాబు, పాబోలు రాజగోపాలం పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం డైమండ్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేయడం అభినందనీయమని పడాల వృద్ధాశ్రమం నిర్వాహకులు కొనియాడారు. డైమండ్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్ వేగేశ్న రామరాజు సౌజన్యంతో వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం అన్నదానం, పండ్లు అందజేశారు. వశిష్ట లియో క్లబ్ అధ్యక్షురాలు లియో మాధురి, సభ్యులు కార్తీక్, బాల శివ, ప్రజ్ఞ, అంబికా తదితరులు మాట్లాడుతూ వృద్ధులను ప్రతి ఒక్కరు ఆదుకోవాలని, వారికి మానసికంగా ఇబ్బందులురాకుండా ప్రశాంతజీవనం సాగే విధంగా చూడాలని, వృద్ధులకు వివిధ సేవలను తప్పకఅందించాలని దాతలకు విజ్ఞప్తి చేశారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్‌చే నిత్యావసర వస్తువులు పంపిణీ అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొండయ్య చెరువు వద్ద లార్డ్ ఆఫ్ లైఫ్‌లోని విద్యార్థులకు దాత, మహిళా కార్యదర్శి దుగ్గిన వెంకట లక్ష్మిచే బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులు, విద్యా సామాగ్రి, బిస్కెట్లు, చాక్‌లైట్లు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజలక్ష్మి, కనక దుర్గ, ప్రభావతి, రామలక్ష్మి, అరుణ కుమారి, ప్రసాద్, చలం, యోహాను, జనార్ధనరావు, రామ్మోహన్‌రావు, దూలం సత్యనారాయణ పాల్గొన్నారు.

త్వరితగతిన ఈ-కేవైసీ చేయించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు త్వరితగతిన ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని ఆరుగొలను, కొత్తూరు, పెదతాడేపల్లి, మోదుగ గుంట, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో పర్యటించి ఈ-కేవైసీ నమోదును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదితో ఈ-కేవైసీ నమోదు ముగుస్తుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి, ఆర్‌బీకేలకు తమ ఆధార్, మొబైల్ ఫోన్‌తో వెళ్ళి ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే, రైతులు తాము పండించిన పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు, వీఏఏలు తదితరులు ఉన్నారు.

జగనన్న ఇళ్లు పూర్తిగా ప్రభుత్వమే నిర్మించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదల కోసం నిర్మించ తలపెట్టిన జగనన్న ఇళ్లను పూర్తిగా ప్రభుత్వమే నిర్మించి, లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సభ్యులు కొరిడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావులు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల వద్ద అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, శేషుబాబు, సతీష్, ఎస్.కృష్ణ, రమణ, నారాయణరావు, నానాజీ, ఏపూరి శ్రీను, కొండలరావు, శ్రీను, ధర్మారావు, పార్టీ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

2 నుంచి ముళ్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

పెంటపాడు: మార్చి 2 నుంచి రావిపాడు గ్రామ ఇలవేల్పు ముళ్లమ్మ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా గత రెండు రోజుల నుంచి ఆలయం వద్ద ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ట్రస్టీ తాతారావు మాట్లాడుతూ మార్చి 1న సాయంత్రం అమ్మవారిని పుట్టింటికి గరగలతో ఊరేగింపు, 2న అమ్మవారి సేవా మహోత్సవం, గ్రామాల్లోని ఇళ్ల వద్ద పొన్పు, గరగలతో అమ్మవారి ఊరేగింపు, 10 గంటలకు ఆడపడుచులతో కుంకుమపూజలు, 3న అమ్మవారిని చుట్టుపక్కల గ్రామాలైన చింతపల్లి, బి. కొండేపాడు, దువ్వ గ్రామాల్లో అమ్మవారి దర్శనాలు ఊరేగింపు, 4న ఆలయం వద భారీ అన్నసంతర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త తాతరావు సోదరులు తెలిపారు.

ఆసక్తికరంగా.. ఆకట్టుకునేలా..!

- సర్కారు బడుల్లో ట్యాబ్‌ల ద్వారా ఇంగ్లీష్ బోధనలు
- శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు



తాడేపల్లిగూడెం మండలం కడియద్ద జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బైజూస్ యాప్ ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు హిమబిందు

తాడేపల్లిగూడెం రూరల్: ఆంగ్ల బోధన అందుబాటులోకి వచ్చింది. సర్కారు బడుల్లోనూ ఆసక్తికరంగా సాగుతోంది. ఒకప్పుడు ఇంగ్లీష్ ల్యాబ్‌లు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లల్లోనే ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానంలో సర్కారు బడుల్లోనూ పేద విద్యార్థులు ఇంగ్లీష్ ల్యాబ్‌ల్లో విద్యాభ్యాసం సాగిస్తున్నారు. విద్యా వ్యవస్థకు చక్కని బాట వేస్తున్న ప్రభుత్వం నాడు-నేడుతో స్కూళ్ల రూపురేఖలు మార్చింది. కార్పొరేట్‌కు తలదన్నేలా సకల సౌకర్యాలతో సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ ల్యాబ్‌లు డిజిటల్ క్లాస్ రూమ్‌లు అందుబాటులోకి రావడంతో అక్కడే తరగతులు బోధిస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలంలో 1540మందికిగాను 1509 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆయా ట్యాబ్‌లలోకి బైజూస్ యాప్‌ను నిక్షిప్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు క్లాస్ రూమ్‌ల్లో పాఠాలు బోధిస్తున్నారు. ఎల్ ఈడీ ప్రొజెక్టర్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిని తరగతి గదుల్లో అమర్చి పాఠాలను బోధిస్తున్నారు. ముందుగానే అర్బన్, రూరల్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు డిజిటల్ పాఠాల బోధనపై శిక్షణ ఇచ్చారు. వాటిని ఏ విధంగా బోధించాలి, ఎలా ఉపయోగించాలనే దానిపై మెళకువలను నేర్పారు. రోజు స్కూల్‌లో రెండు పిరియడ్లను ఏర్పాటు చేశారు. దీనిలో తప్పనిసరిగా ఒక కంట ఆయా సబ్జెక్టును ఉపాధ్యాయులు డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా బోధించాలి. విద్యార్థులు సాధారణ పాఠాల కన్నా డిజిటల్ క్లాస్ రూమ్ ద్వారా చెబుతున్న పాఠాలకు ఆసక్తి చూపుతున్నారు. నోటితో చెప్పే పాఠాల కన్నా ప్రొజెక్టర్ ద్వారా బోధించడంతో ఆసక్తికరంగా వింటున్నారు. అభ్యాస ఆండ్రాయిడ్ యాప్ ద్వారా ఉపా ధ్యాయులకు శిక్షణనిచ్చారు. ప్రతి పాఠ్య పుస్తకంలో క్యూర్ కోడ్ ఉంటుంది. దీనిని ఇంటర్నెట్ ఉపయోగించి స్కాన్ చేస్తే ఆ పుస్తకంలో పాఠాలన్నీ తెరపై ప్రత్యక్షమవుతాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేని స్కూళ్లకు పెన్ డ్రైవ్, సెల్‌ఫోన్ల ద్వారా ఎల్‌ఈడీ ప్రొజెక్టర్లకు కనెక్టు చేసుకొని డిజిటల్ పాఠాలను బోధిస్తు న్నారు. ఈ విధానం చాలా ఉపయోగకరంగా ఉంది. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు ఇంగ్లీష్ ల్యాబ్, ఏడు, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు డిజిటల్ క్లాస్ రూమ్స్ ద్వారా విద్యాబోధన చేస్తుండగా, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ట్యాబ్‌ల ద్వారా బైజూస్ పాఠాలను అందిస్తున్నారు.

బైజూస్‌తో సందేహాల నివృత్తి



భౌతికంగా తరగతి గదుల్లో చెప్పే పాఠాలు అర్థం కాని పక్షంలో బైజూస్ ద్వారా వాటిని నివృత్తి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అలాగే విద్యార్థులకు పరీక్షలను సైతం నిర్వహిస్తాం. తద్వారా తరగతి గదిలో బోధించిన అంశాలు ఎంత వరకు విద్యార్థికి అర్థమయ్యేయి అనే విషయం తెలుసుకోవడానికి వీలుంటుంది.

– మైనం సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు, కొమ్ముగూడెం జెడ్పీహెచ్ఎస్,

పాఠాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారు



తాడేపల్లిగూడెం మండలంలోని పాఠశాలల్లో 95 శాతం మంది విద్యార్థులు బైజూస్ యాప్‌ను వినియోగించడం జరుగుతుంది. ఇటీవలే ఉపాధ్యాయులకు సైతం ట్యాబ్‌లను అందించాం. తద్వారా విద్యార్థులకు బైజూస్‌లో పాఠ్యాంశం అర్థమయ్యే రీతిలో బోధించడానికి ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుంది. రెండు మాధ్యమాల్లో బైజూస్ యాప్ ఉండటం వల్ల విద్యార్థులు సులభతరంగా ఉంటుంది. త్వరలోనే తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు సైతం ట్యాబ్‌లను అందిస్తాం.

– వి.హనుమ, మండల విద్యాశాఖ అధికారి, తాడేపల్లిగూడెం

ఎరువుల దుకాణంలో తనిఖీలు



అత్తిలిలో ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ మురళీకృష్ణ

అత్తిలి: మండలంలో పలు ఎరువుల దుకాణాలను తాడేపల్లిగూడెం స్క్వాడ్ ఏడీఏ పి మురళీకృష్ణ సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల డీలర్లు విధిగా రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, అమ్మిన ప్రతీ బస్తా ఎరువును ఈ పోస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో రెండు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు అర్జీలు అందాయని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అన్నపూర్ణ, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, వెలుగు ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఆర్ ఎస్.ప్రసాద్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

● ఆత్మీయ కలయిక



డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన నివాసగృహంలో సోమవారం పార్టీ ప్రముఖులు కలిశారు. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నేత, రీజనల్ కో-ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. కొంతసేపు మంత్రితో మాట్లాడిన తర్వాత నాయకులు తిరిగి వెళ్లారు. – తాడేపల్లిగూడెం

గృహసారథులే విజయానికి వారధులు

- రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- అత్తిలిలో గృహసారథుల సమావేశం



అత్తిలిలో గృహసారథుల మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

అత్తిలి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని గృహ సారథులు ఇంటింటికి వెళ్లి వివరించి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి వారధులుగా పనిచేయాలని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మండపంలో సోమవారం మండల స్థాయి గృహసారథులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ గృహసారథుల పదవిని తేలికగా తీసుకోవద్దని, భవిష్యత్‌లో జరిగే పదవులలో వారికి ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మానసపుత్రిక అయిన వలంటీర్ వ్యవస్థకు అనుబంధంగా గృహసారథులు కూడా ఇంటింటికి తిరిగి ప్రజల్లో మమేకం కావాలన్నారు. గృహసారథులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడమే కాకుండా వారి సమస్యలను తెలుసుకుని గ్రామ కన్వీనర్లకు తెలపాలని సూచించారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, అనుకూల మీడియా చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. తణుకు నియోజకవర్గంలో అన్ని రహదారులు జూన్ నాటికి నిర్మాణం పూర్తవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటా విజేతనాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, మండల గృహసారథుల కన్వీనర్ పెన్మెత్స రామరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, మండల పార్టీ నాయకులు రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, కాకర్ల విశాలాక్షి, దారం శిరీషా, శింగంశెట్టి శ్రీనివాస్, పోలినాటి చంద్రరావు, ఆకుల పండుస్వామి, పెన్మెత్స సుబ్బరాజు, సబ్బితి రాజేష్, తమ్మాబత్తుల రాము, గారపాటి నాగరాజు, బుడితి సుజన్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండలంలోని రామన్నగూడెం, పెదతాడేపల్లి-1, 2 సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరపీడితులను గుర్తించి, వారిని హెల్త్ క్లీనిక్‌లకు తరలించాలన్నారు. దోమలద్వారా డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికున్ గున్యా వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. వీటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ ఆరోగ్య కార్యదర్శులు పద్మ, దానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, నాగేశ్వరరావు, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పూటలా మస్తరు విధానం రద్దు చేయాలి



బడ్జెట్ పెంచాలంటూ నినాదాలు చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకంలో రెండు పూటలా మస్తరు విధానం రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉపాధి పని ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సోమరాజు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ సమస్యలు కారణంగా రెండు పూటలా మస్తర్లు వేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. మస్తరు వేయడానికి కాలాతీతమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తలారి సుబ్బారావు, మల్లిపూడి వెంకటేష్‌లు, రేఖపల్లి నాగమణి, కండెల్లి లక్ష్మీ, పోలిశెట్టి సుజాతలతో నూతన కమిటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సీనియర్ సభ్యులను సత్కరించిన దృశ్యం

తణుకు: బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తణుకు బ్రాంచి స్వర్వసభ్య సమావేశం సోమవారం కె.మణిలాల్ అధ్యక్షతన జరిగింది. గత ఏడేళ్లుగా తాత్సారం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ రివిజన్ సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 75 ఏళ్లు నిండిన బ్రాంచ్ సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారుగా జి.రాజశేఖర్, అధ్యక్షుడిగా కె.మణిలాల్, కార్యదర్శిగా ఎం.అప్పలాచార్యులు, కోశాధికారిగా టి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బొడ్డు విక్టర్ బాబుతో పాటు 23 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ వి.వరప్రసాదరావు, ఆంధ్రరాష్ట్ర సర్కిల్ సెక్రటరీ డి.వెంకటేశ్వరరావు, ఆల్ ఇండియా కార్యవర్గ సభ్యులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి, పి.పుల్లారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.పూర్ణాచార్యులు, విశ్వనాథం, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, బ్రాంచ్ సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించే వాహనాలు నడపాలి



నవాబుపాలెంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రూరల్ ఎస్ఐ వీరభద్రరావు

అత్తిలి: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్ ధరించాలని తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు కోరారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం అత్తిలి గ్రామంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించేందుకు పోలీస్ సిబ్బంది హెల్మెట్ ధరించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడానికి హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు, ఇరగవరం, అత్తిలి ఎస్సైలు గుర్రయ్య, హనుమంతరావు, కె చంద్రశేఖర్, సీహెచ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్‌లో : మండలంలోని నవాబుపాలెం గ్రామంలో సోమవారం హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయంలో హెల్మెట్ ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందన్నారు. హెల్మెట్ ధరించడం ఒక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెంటపాడు: విద్యార్థులు రక్త హీనత పట్ల సరైన శ్రద్ధ వహించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని భుజించాలని ఉమామహేశ్వరం నెం-1 ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వి. మోహనరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించే రక్త, ఇతర పరీక్షలు స్థానిక వైద్యసిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ఏ మాత్రల పై విద్యార్థులకు వివరించారు. భోజనానికి ముందు, అనంతరం కూడా విద్యార్థులు చేతుల శుభ్రత, ఆరోగ్య కరమైన జీవన శైలి, హెల్త్ ఎడ్యుకేషన్‌పై ఆరోగ్యకార్యకర్త వరలక్ష్మి, ఏఎన్ఎం జయప్రద తదతరులు విద్యార్థులకు వివరించారు. అవసరమైనవారికి మాత్రలు అందించారు.

ట్రిపుల్ ఎఫ్ క్యాంపస్ సెలక్షన్‌లో 43 మంది ఎంపిక

పెంటపాడు: ప్రత్తిపాడు ట్రిపుల్ ఎఫ్ కర్మాగారం ఆధ్వర్యంలో స్కిల్ డవలప్ మెంట్ ప్రోగ్రాంలో భాగంగా పలు కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో పలు విభాగాలకు చెందిన 43 మంది ఎంపికైనట్లు కర్మాగార ప్రతినిధి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జెప్టో, వెల్‌స్పన్‌ఇండియా, బ్లిన్కిట్, షిర్డీసాయి ఎలక్ట్రికల్, గ్రీన్ టెక్ , ట్రిపుల్ ఎఫ్ ఇండస్ట్రీల్లో నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారన్నారు. వారిని కర్మాగార ప్రతినిధులు ఓపీ గోయంకా తదితరులు ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

మంత్రి పరామర్శ



రేలంగిలో నరసింహరాజు చిత్ర పటానికి నివాళ్లుర్పిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మెత్స నరసింహ రాజు ఇటీవల మృతి చెందారు. సోమవారం రేలంగిలో ఆయన చిత్ర పటానికి రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైస్సార్ సీపీ కష్ట కాలంలో ఆయన పార్టీకి వెన్ను దన్నుగా ఉన్నారన్నారు. గ్రామంలో ఎంతో మందికి రాజకీయ గురువుగా ఉండి వారిని ముందుకు నడిపించారన్నారు. అలాంటి నాయకుడ్ని కోల్పోవడం బాధకరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, గ్రామా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పులుపు అనిల్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, గ్రామ వైఎస్సార్ సీపీ గౌరవ అధ్యక్షుడు మార్కండేయులు, నాయకులు మైనం పాము, చేబ్రోలు పెద్దిరాజు, కొండపల్లి త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షుడు నడుంపల్లి శ్రీరామా రాజు, కృష్ణంరాజు, ఆంజనేయులు ఎంపీటీసీ దాసి రెడ్డి మహాలక్ష్మీ, రాట్నాల రమణ, మెట్ల డాడీ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి



అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలీశ్వరయ్య, విశాలాక్షి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలని భవిత సెంటర్ నిర్వాహకులు ఎస్‌కే బాలీశ్వరయ్య పలు సూచనలు చేశారు. పట్టణంలోని సుబ్బారావుపేటలోని భవిత దివ్యాంగుల కేంద్రంలో సోమవారం వైకల్యాలు-వాటి నివారించే కార్యక్రమాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలీశ్వరయ్య మాట్లాడుతూ గర్భిణులు మానసిక ఆందోళన తగ్గించుకొని, సంపూర్ణ పోషక ఆహారం తీసుకునే విధంగా చూడాలని తెలిపారు. జాగ్రత్తలు, సూచనలు పాటించినట్‌లెతై పుట్టిన పిల్లలలో వైకల్యం లోపం రాకుండా కాపాడువచ్చునని చెప్పారు. వైకల్యాలు ఉన్న పిల్లలకు భవిత కేంద్రంలో వైకల్యాలను బట్టి ప్రత్యేక శిక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.విశాలాక్షి మాట్లాడుతూ స్త్రీలు గర్భం ధరించినప్పటి నుంచి తప్పకుండా ప్రతి ఒక్కరు వైద్యుని సలహా మేరకు జాగ్రత్తలు పాటించినట్లయితే పిల్లలకు వైకల్యాలు రాకుండా కాపాడిన వారం అవుతామని వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్స్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హస్త కళలను ప్రోత్సహించాలి

తణుకు టౌన్: చేతి వృత్తులు చేసే కళాకారులను ప్రోత్సాహించడం ద్వారా మరి కొంతమంది కళాకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని హ్యాండీ క్రాఫ్ట్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ అపర్ణలక్ష్మీ చెప్పారు. సోమవారం తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల మహిళా సాధికార సెల్, వశిష్ఠ గోదావరి లేస్‌మోడ్ మొగల్తూరు మండలం రామన్నపాలెం యూపీఎస్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో లేస్ ఉత్పత్తుల ప్రదర్శనా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసభకు కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. చేతి వృత్తుల ద్వారా వస్తువులను తయారు చేయడం ద్వారా మనిషిలో మానసిక ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి, అద్దకం మొదలైన హస్త కళలు మన రాష్ట్రంలో పుట్టాయని చెప్పారు. ఈ కళలు భారతీయ సంస్కృతి, వారసత్వానికి ప్రతికలు అని చెప్పారు. కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యురాలు చిట్టూరి రీనాసాయి మాట్లాడుతూ హస్త కళలు ప్రాముఖ్యం భావి తరాలకు తెలియజేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో హస్త కళల ప్రమోషన్ ఆఫీసర్ ఎం సువర్చల, పీడీ సుదీర్ కుమార్, కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఏవో డాక్టర్ డీ సుబ్బారావు, మహిళా సాదికార సెల్ కన్వీనర్ కేవీ శ్యామలాదేవి, వీ తులసీ రత్నంలు పాల్గొన్నారు. విద్యార్థినీలకు వక్తృత్వ, చిత్రలేఖన, పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.